

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రేపు

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక సౌందర్య థియేటర్ జంక్షన్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. పది గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇచ్చినోళ్లకు నచ్చినచోటు!



- ఎక్సైజ్ శాఖలో ఇష్టారాజ్యంగా బదిలీల ప్రక్రియ
- పార్వతీపురం జిల్లాకు నామమాత్రంగా కేటాయింపు
- అక్కడ కుటీర పరిశ్రమలా నాటుసారా తయారీ, అమ్మకాలు
- విధుల నిర్వహణ అక్కడ కత్తిమీద సామే
- విజయనగరంలోనే మూడొంతులమందికి అవకాశం
- అక్రమాలు జరిగాయని సీఎం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఇటీవల జరిగిన బదిలీల అంశం ఆశాఖలో హాట్‌టాపిక్ అయింది. బదిలీల ప్రక్రియలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. ఓ ఉద్యోగి తనకు అన్యాయం జరిగిందని ఆగ్రహించడంతో విషయం బయటకు పొక్కింది. బదిలీలు జరిగిన తీరు, అక్రమాలను పేర్కొంటూ ఆయన నేరుగా ముఖ్యమంత్రికి, ఎక్సైజ్ కమిషనర్ (అమరావతి), ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్, ఏసీబీ డిప్యూటీ జనరల్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం మరింత కలకలం రేగింది. ఇచ్చిన వారికి నచ్చిన చోట పోస్టింగ్.. ఇవ్వని వారిని మాత్రం సుదూర స్టేషన్లకు వేశారన్న విమర్శలు ఉన్నాయి.

జియ్యమ్మవలస/మెంటాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):

విజయనగరం జిల్లా వేపాడకు చెందిన కాని స్టేబుల్ టి.సన్యాసిరావుకు గతంలో బ్రెయిన్ సర్జరీ జరి గింది. ఆయన్ను పార్వతీపురం మన్యం జిల్లా క్రైమ్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలికి తీవ్ర గాయమైంది. ఎముక విరిగినట్టు వైద్యులు గుర్తించారు. ఇప్పుడాయాన ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను పార్వతీపురానికి బదిలీ చేయడంలో అంతర్యం ఏమిటో. అలాగే వంగరకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎ.ప్రసాదు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈయన పక్షవాతానికి గురయ్యారు. ఈయన్ను కూడా మన్యం జిల్లాకు బదిలీ చేశారు. బదిలీల్లో అక్రమాలు జరిగాయన డానికి ఈ ఉదాహరణలు బలం చేకూర్చుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో (మిగతా 8వ పేజీలో..)

నిబంధనల మేరకే బదిలీలు..

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో నిబంధనల మేరకే బదిలీలు జరిగాయి. అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఈ ప్రక్రియను పూర్తిచేశాం. ప్రమోషన్లు పొందిన వారిని పార్వతీపురం మన్యం జిల్లాలో ఖాళీలు ఉన్నచోట నియమించాం. ఎవరికీ అన్యాయం జరగకుండా చూశాం. కొంతమంది ఆరోపణలు చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. వాటిని పరిశీలిస్తున్నాం. బదిలీల్లో అక్రమాలకు చోటేలేదు. ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహించాం. అనుమానాలకు ఆస్కారమే లేదు.

-శ్రీనాథుడు, సూపరింటెండెంట్, జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్



విచ్చలవిడిగా సారా తయారీ.. దిగుమతి

పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస, కొమరాడ, పాచిపెంట, మక్కువ, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట మండలాల్లో విచ్చలవిడిగా సారా తయారు చేస్తున్నారు. కొందరు స్థానికులు కుటీర పరిశ్రమలా చేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. అక్కడ తయారు చేయడం.. జిల్లాలోని ఇతర ప్రాంతాలకు తరలించడం పరిపాటిగా మారింది. ఈ తతంగంపై స్థానిక ఎక్సైజ్ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా పార్వతీపురం డివిజన్ పరిధిలో సారాకు కేరాఫ్ అడ్రాస్‌గా ఆంధ్రా - ఒడిశా సరిహద్దులోని రెండు గ్రామాలున్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలానికి ఆనుకుని ఒడిశా రాష్ట్రంలోకి ముఖద్వారంలా చెప్పుకుంటున్న సందుబడి గ్రామం ఒకటైతే, కొమరాడ మండలంలో రాష్ట్రాల సరిహద్దు గ్రామం కెరడ మరొకటి. ఈ రెండు గ్రామాల నుంచి సారాను కొందరు అక్రమంగా రవాణా చేస్తున్నారు. కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ పరిధిలో ఈ ఏడాదిలో చాలా కేసులు నమోదయ్యాయి.

జిల్లాకు రెండు టీఎంఎంసీలు

- సాలూరు, సీతంపేటలో ఏర్పాటు
- ఒక్కొక్క భవనానికి రూ.కోటి మంజూరు
- గిరిజనులకు ఎంతో ఉపయోగం



పార్వతీపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు రెండు ట్రైబల్ మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాలు (టీఎంఎంసీ) మంజూరయ్యాయి. ఈ మేరకు ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ ఎం.ఎం.నాయక్ ఈ నెల 2న ఆదేశాలు జారీ చేశారు. ధరతి, అబ, జన, చైత్య గ్రామ వత్ క్రాస్ అభయం (డీఏజేజీయూఏ) పథకంలో భాగంగా రాష్ట్రంలో ఆరు టీఎంఎంసీలు మంజూరయ్యాయి. అందులో జిల్లాకు రెండు కేటాయించారు. సాలూరు, సీతంపేటలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కొక్క కేంద్రాన్ని రూ.కోటితో నిర్మించనున్నారు. సీతంపేటలోని తురాయిపువలస సంత వద్ద, సాలూరు సంత వద్ద వీటిని నిర్మించనున్నారు. ఈ కేంద్రాలు గిరిజనులకు ఎంతో ఉపయోగపడనున్నాయి. వారు సంతలకు తీసుకొని వచ్చే అటవీ ఉత్పత్తులను ఈ కేంద్రాల ద్వారా విక్రయించవచ్చు. ఉత్పత్తులు ఏమైనా మిగిలిపోతే స్టోరేజ్ కూడా చేసుకోవచ్చు. దళారుల బెడద తప్పనుంది. జీసీసీ ద్వారా గిరిజనులకు కావాల్సిన నిత్యావసర సరుకులను కూడా ఈ కేంద్రాల ద్వారా విక్రయించనున్నారు. ఐటీడీఏ లేదా గిరిజన కార్పొరేషన్ ద్వారా నిత్యావసరాలను విక్రయించడం వల్ల గిరిజనులకు నాణ్యమైన సరుకులు లభ్యమవుతాయి.

గిరిజనులకు ప్రయోజనం



సాలూరు, సీతంపేటలో ఏర్పాటు చేయనున్న ట్రైబల్ మల్టీపర్పస్ మార్కెట్ కేంద్రాలతో గిరిజనులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ఒక్కొక్క కేంద్రాన్ని కోటి రూపాయలతో నిర్మిస్తాం. మంచి ధర వచ్చినప్పుడు అటవీ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు గిరిజనులకు అవకాశం ఉంటుంది. జిల్లాకు రెండు కేంద్రాలు మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

-గుమ్మిడి సంధ్యారాణి, రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి

మహిళల కోసం శక్తి

- యాప్‌తో రక్షణ
- మఫ్టీలో పోలీసుల గస్తీ

6 లో

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

- పశువుల శాలలో ఉరేసుకున్నవైనం

7 లో

వెంటాడి.. పట్టుకుని

- రూ.39 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- వాహనాలు విడిచిపెట్టి పరారైన ముగ్గురు వ్యక్తులు
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ అంకిత సురానా



స్వాధీనం చేసుకున్న గంజాయి

సాలూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పోలీసులను చూసిన గంజాయి స్మగ్లర్లు వాహనాలను యూటర్న్ తీసుకుని తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వారిని చూసిన పోలీసులు వెంటాడి రూ.39 లక్షల విలువైన గంజాయిని పట్టుకున్నారు. అయితే, వాహనాలను విడిచిపెట్టి ముగ్గురు స్మగ్లర్లు పరారయ్యారు. ఈ వివరాలను పార్వతీపురం ఏఎస్పీ అంకిత మహావీర్ సురానా గురువారం విలేకరులకు వెల్లడించారు. ఆమె వివరాల మేరకు.. గంజాయి రవాణాపై సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణకు విశ్వసనీయ సమాచారం వచ్చింది. దీంతో పాచిపెంట మండలం ఆలూరు వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవేపై సీఐ పర్యవేక్షణలో పాచిపెంట ఎస్ఐ వెంకటసురేష్, పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో పాచిపెంట మండలం పెదమడ ఘాట్‌రోడ్డు నుంచి బొలేరో, ఆల్టో వాహనాలు వచ్చాయి. పోలీసులను చూసి అవి యూటర్న్ తీసుకున్నాయి. అవి వచ్చిన దారినే వెళ్లిపోతుండడంతో ఎస్ఐ వెంకటసురేష్, సిబ్బంది జీపులో వాటిని వెంటాడారు. కొంత దూరం వెళ్లిన తరువాత రెండు వాహనాలను నిలిపి ముగ్గురు వ్యక్తులు అందులో నుంచి దిగి పారిపోయారు. వారిని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నించగా తలో దారిలో చీకట్లో పారిపోవడంతో దొరకలేదు. వాహనాలను తనిఖీ చేయగా 43 ప్యాకెట్లతో ఉన్న 396 కిలోల గంజాయి పట్టుబడింది. వాటి విలువ దాదాపు రూ.39 లక్షలు ఉంటుందని ఏఎస్పీ (మిగతా 8వ పేజీలో..)



వివరాలు చెబుతున్న ఏఎస్పీ అంకిత సురానా

తప్పని డోలీ మోత

- అనారోగ్యానికి గురైన గిరిజనుడు
- రోడ్డు పూర్తి కాకపోవడంతో డోలీలో ఆస్పత్రికి తరలింపు

సాలూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురైన ఓ గిరిజనుడిని డోలీలో ఆస్పత్రికి తరలించిన ఘటన గిరిశిఖర గ్రామం బొడ్డపాడులో గురువారం చోటు చేసుకుంది. బొడ్డపాడుకు చెందిన సీదరపు నాగేశ్వరరావుకు ఆకస్మికంగా తాళలేని కడుపునొప్పి వచ్చింది. అయితే, బొడ్డపాడు నుంచి జిల్లేడువలస వరకు రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో నాగేశ్వరరావును వాహనంలో ఆస్పత్రికి తరలించేందుకు వీలుపడలేదు. దీంతో బంధువులు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు తదితరులు డోలీ కట్టి ఆయన్ను దాదాపు మూడు కిలోమీటర్లు మోసుకుంటూ కొండ దిగి జిల్లేడువలసకు చేరుకున్నారు. అక్కడ నుంచి ఆటోలో సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. దీంతో నాగేశ్వరరావును అక్కడకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు మాట్లాడుతూ.. కరడవలస నుంచి బొడ్డపాడు మీదుగా జిల్లేడువలసకు రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తే గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.



నాగేశ్వరరావును డోలీలో కొండపై నుంచి కిందకు దించుతున్న బంధువులు

ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్‌లో ఏపీడీలు, ఏపీఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2.30 లక్షల మంది మహిళా సభ్యులు ఉండగా, వారిలో సగానికి పైగా రూ.లక్ష లోపు వార్షికాదాయం ఉన్నవారే ఉన్నారని అన్నారు. అటువంటి వారిని గుర్తించి వారితో అనుకూలంగా ఉండే వ్యాపారాలను చేయించి, ప్రతి మహిళను లక్షలాధికారులుగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు ఎస్‌హెచ్‌జీ నిధులే కాకుండా డీఆర్‌డీఏ, వెలుగు సంస్థ నుంచి కూడా సహకారం పొందాలని సూచించారు. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళా వ్యాపారవేత్త రావాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధి హామీ పథకంలో చెరువు గట్లపై కొబ్బరి, పనస వంటి మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఫలసాయం నుంచి వచ్చే ఆదాయాన్ని మహిళలు ఆర్జించవచ్చునన్నారు. గ్రామ పంచాయతీ చెరువుల్లో చేపల పెంపకం చేపట్టవచ్చునని, తద్వారా చెరువులు బాగుపడడంతో పాటు మత్స్యసంపదతో అధిక ఆదాయం లభిస్తుందన్నారు. అలాగే పశుసంవర్థక ద్వారా గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకంతో పాటు అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు పథక సంచాలకులు సుధారాణి, వై.సత్యంనాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎంవీ కరుణాకర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేసి, ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ మంచి ఫలితాలు సాధించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లాలో చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి సంబంధించి ప్రగతి నివేదికలను ఎప్పటికప్పుడు సిద్ధం చేసి సకాలంలో అందించాలని ఆదేశించారు. దీనిద్వారా వెనుకంజలో ఉన్న ఆరోగ్య కేంద్రాలను గుర్తించి, అందుకు ఉన్న కారణాలపై విశ్లేషణ చేపట్టి పనితీరును మెరుగుపర్చుకునేందుకు వీలుంటుందన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదును పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లాలో మాతా, శిశు వైద్య సేవల నిర్వహణ, అసంక్రమిత వ్యాధుల సర్వే, టీబీ, లెప్రసీ, స్కూల్ హెల్త్, స్వచ్ఛాంధ్ర తదితర ఆరోగ్య కార్యక్రమాలు పగడ్బందీగా అమలు చేయాలన్నారు. సంబంధిత పోర్టల్స్, యాప్ నమోదు తీరును పరిశీలించాలని ఆదేశించారు. ఎక్కడైనా వ్యాధులు గుర్తిస్తే ఎపిడమిక్ సెల్ వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అందరూ సమయపాలన పాటిస్తూ మెరుగైన పనితీరును చూపించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఐవో ఎం.నారాయణరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహన్‌రావు, పీఎల్.రఘుకుమార్, ఎం.వినోద్‌కుమార్, సూపరింటెండెంట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇటు విద్య.. అటు ఉపాధి

- పది తరువాత కోర్సులు ఎన్నో
- అందుబాటులో వృత్తి విద్య
- ప్రణాళికతో ముందుకెళితే మేలు

6 లో



ఇటు విద్య.. అటు ఉపాధి





- పది తరువాత కోర్సులు ఎన్నో
- అందుబాటులో వృత్తి విద్య
- ప్రణాళికతో ముందుకెళితే మేలు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)

విద్యార్థి జీవితంలో కీలకమైనది పదో తరగతి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 22,774 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు. వీరందరి భావి జీవితాన్ని మలుపు తిప్పేవి పదిలో సాధించిన మార్కులే. ఉన్నత చదువులు, ఉద్యోగాలకు ఈ మార్కులను కొలమానంగా తీసుకుంటారు. పదో తరగతి తర్వాత చాలా మంది విద్యార్థులు ఏ కళాశాలలో చేరాలి? ఏ కోర్సులు చదవాలి? ఇంకా ఏం చేయవచ్చు? ఇలా పరిపరివిధాలుగా ఆలోచిస్తుంటారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే కోర్సుల కోసం తల్లిదండ్రులు అన్వేషిస్తుంటారు. కానీ వాటిలో సరైనది ఏదో తెలియక గందరగోళానికి గురవుతుంటారు. జీవితంలో త్వరగా స్థిరపడే అవకాశాలు ఉన్న కోర్సుల గురించి తెలియక ఇబ్బంది పడుతుంటారు. పది తరువాత ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, సంప్రదాయ కోర్సులతో పాటు వృత్తి విద్యాకోర్సులు, సాంకేతిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం.

● వృత్తి విద్యా కోర్సులు..

ఉపాధి విద్య, ఉపాధితో కూడిన విద్య... వీటిలో దేనిని ఎంపిక చేసుకున్నా మేలైన ఫలితాలు కనబడతాయి. దీనిలో వ్యవసాయం, వెటర్నరీ, రేడియో అండ్ టీవీ మెకానిజం, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ టెక్నాలజీ, కార్యాల నిర్వహణ, పారా మెడికల్ కోర్సులు, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్, డెయిరీ, కేటరింగ్, ఆప్తాలమిక్ అసిస్టెంట్లు తదితర కోర్సులు ఇందులో ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే కాకుండా కొన్ని గుర్తింపు పొందిన ప్రైవేటు కళాశాలల్లో కూడా ఈ కోర్సులు అందుబాటులో ఉంటున్నాయి.

● ఐటీఐ...

పదో తరగతి పూర్తయిన తర్వాత ఉన్నత చదువులు చదువుకోవడానికి ఆర్థిక స్థోమత లేనివారు, స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి ఐటీఐ మంచి అవకాశం. ప్రస్తుతం నవ్యాంధ్రలో నూతన నిర్మాణాల దృష్ట్యా ఐటీఐకి ఆదరణ పెరిగింది. అందులో సివిల్, మెకానికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ తదితర కోర్సులు ఉన్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలు 12 వరకూ ఉన్నాయి. వీటిల్లో చదువుకున్న వారిలో ఎంతోమంది ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్నారు.

● స్వయం ఉపాధికి...

పది తర్వాత ఎన్నో రకాల స్వయం ఉపాధి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వారు ఎంచుకున్న రంగంలో ఉన్న చోటనే స్వయం ఉపాధి పొందేందుకు అవకాశముంది. ఈ కోర్సుల కోసం వివిధ సంస్థలు శిక్షణ ఇస్తున్నాయి. శిక్షణ కాలం, కోర్సులు, ఖర్చు తదితర వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీబీ-ఐఆర్‌ఈడీ. ఓఆర్‌జీలో తెలుసుకోవచ్చు. ఇందులో బాలబాలికలకు ఇచ్చే శిక్షణ వివరాలతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

● ఇంటర్...

పదో తరగతి తర్వాత సాధారణంగా అందరూ ఎక్కువగా చేరేది ఇంటర్‌లోనే. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఇంటర్ విద్య అందుబాటులో ఉంది. అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు, కెజీబీవీల్లోనూ ఇంటర్ విద్య అందుబాటులో ఉంది. రెగ్యులర్, వృత్తి విద్యాకోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఉన్న ముఖ్యమైన నాలుగు గ్రూపులపై అవగాహన పెంచుకోవాలి. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా గ్రూపులు ఎంపిక చేసుకోవాలి. సబ్జెక్టు మీద పట్టు ఉందో లేదో ముందుగా పూర్తి అవగాహనకు వచ్చి.. సంబంధిత కోర్సుల్లో చేరడంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయో కూడా తెలుసుకోవాలి.



● పాలిటెక్నిక్...

సాంకేతిక విద్యలో చేరాలనుకునే వారికి పాలిటెక్నిక్ అనువైనది. ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్ పరీక్ష రాసి అందులో ర్యాంకు సంపాదించుకోవాలి. గతంలో ఈ కళాశాలలు తక్కువగా ఉండడంతో ప్రవేశాలకు విపరీతమైన పోటీ ఉండేది. ప్రస్తుతం కళాశాలల సంఖ్య పెరగడంతో సీట్లు అందుబాటులో ఉంటున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలు 5 వరకూ ఉన్నాయి. ఇందులో ఈఈఈ, ఈసీఈ, సీఎస్‌సీ, ఆటోమొబైల్, మెకానికల్, కెమికల్ తదితర సుమారు 30 బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి. కోర్సు పూర్తిచేసుకుంటే జూనియర్ ఇంజనీర్లుగా ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఉన్నతవిద్యను అభ్యసించాలంటే ఈసెట్ రాసి.. నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరవచ్చు.

● వ్యవసాయ కోర్సులు ఇలా..

జిల్లాలో వ్యవసాయమే ప్రధాన ఆదారం. గ్రామీణ ప్రాంత విద్యార్థులలో వ్యవసాయ సంబంధిత కోర్సులు చేయాలనే ఆసక్తి ఇటీవల ఎక్కువైంది. ఇలాంటి వారి కోసం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలల్లో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. దూర ప్రాంతాల్లో ఈ కళాశాలలు ఉన్నా అక్కడకు వెళ్లి చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది. ముఖ్యంగా డిప్లొమో ఇన్ అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ తదితర కోర్సులు ఉన్నాయి. ఇవి పూర్తి చేసుకున్న వారందరికీ విత్తనాల ఉత్పత్తి కేంద్రాలు, వ్యవసాయ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రభుత్వ పరంగా కూడా ఎంపీఈవోలు, ఆత్మ రిసోర్స్ పర్సన్లుగా చాలామంది ఉద్యోగాలు చేస్తున్నారు.

● ఏపీ ఆర్జేసీ..

రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహిస్తారు. పదో తరగతి పూర్తిచేసిన వారు దీనికి అర్హులు. ప్రభుత్వం దీనిలో ప్రవేశాలకు సంబంధించిన పరీక్షను త్వరలో నిర్వహించనుంది.

ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులతో మేలు..

పదో తరగతి పూర్తయిన తరువాత భవిష్యత్ కోసం ఈ సమయంలో మంచి నిర్ణయం తీసుకోవాలి. ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో చేరితే చాలా మంచిది. ఇంటర్మీడియట్‌లో విద్యార్థి ఇష్టమైన గ్రూపులో చేరితే చాలా బాగుంటుంది. ఉద్యోగ అవకాశాలు ఉన్న కోర్సులపై దృష్టి పెట్టాలి. సాంకేతిక విద్య వంటి కోర్సుల్లో చేరితే మంచి భవిష్యత్ ఉంటుంది. అలాగే వివిధ కోర్సుల్లో చేరడానికి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. పరీక్షలు రాసిన తరువాత విద్యార్థులు ఖాళీగా ఉండకుండా.. వివిధ ప్రవేశ పరీక్షల కోసం చదవాలి. ఇప్పటి నుంచి కష్టపడితే రానున్న రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయి.

-మాణిక్యం నాయుడు, డీఈఓ

ఘనంగా ఉగాది వేడుకలు

- ఏరువాక ముహూర్తమే కొత్త సంవత్సరం
- గజరాయునివలసలో ఏళ్ల నాటి సంప్రదాయం

బొబ్బిలి/బాడంగి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. సాధారణంగా తెలుగు ప్రజలంతా ఒకేసారి ఉగాది పండుగను నిర్వహిస్తారు. కానీ ఆ ఊరు అందుకు భిన్నం. ఉగాది పండగ వెళ్లిన కొన్ని రోజుల తరువాత... నిర్ణీత ముహూర్తం ప్రకారం కొత్త సంవత్సర వేడుకలు నిర్వహిస్తారు. ఇదే క్రమంలో ఈ ఏడాది ఉగాది వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మార్చి 30న ఉగాది పర్వదినం రోజున గజరాయునివలస శ్రీరామ మందిరంలో నిర్వహించిన పంచాంగ పఠన కార్యక్రమంలో ఏరువాక ముహూర్తాన్ని పురోహితుడు బ్రాలేటి రామకృష్ణ శర్మ నిర్ణయించారు. దీనినే కొత్త సంవత్సరంగా భావిస్తారు. ఈమేరకు గురువారం వేకువజామున 4.38 గంటలకు ఏరువాకకు ముహూర్తం పెట్టారు. ఆ సమయానికి రైతులు, కుటుంబంలోని మహిళలతో కలసి నాగలికి, కాడెడ్లకు ప్రత్యేక పూజలు చేశారు. తమ పొలాల్లో దుక్కి దున్ని, పశువుల గెత్తం చల్లారు. అక్కడి నుంచి వచ్చిన తరువాత గోమాతలకు పూజలు చేసి... ఆలయాలకు వెళ్లారు. అనంతరం ఇంటి ఆడపడుచులు, అల్లుళ్లు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి విందు భోజనాలు చేశారు. పొలాలు దున్నడానికి, నాటుబళ్లు లాగడానికి గతంలో ఉన్న మాదిరిగా ఇప్పుడు పశువులు పెద్దగా కనిపించడం లేదు. ట్రాక్టర్ల ద్వారానే దుక్కిదున్నుతున్నారు. ఏరువాక ముహూర్తం కోసం తయారు చేయించిన నాగలికి పసుపు, కుంకుమ బొట్లు పెట్టి, మామిడి తోరణాలు కట్టి పూజలు చేయడం విశేషం. ఉగాది పర్వదినాన పండితులు నిర్ణయించిన ఏరువాక ముహూర్తాన్నే తామంతా ఉగాదిగా పరిగణిస్తామని స్థానికులు చెబుతున్నారు. పూర్వీకుల నుంచీ ఇదే ఆచారం కొనసాగుతోందని అంటున్నారు.



నాగలికి పూజలు చేస్తున్న మహిళలు



ట్రాక్టర్‌పై పొలానికి వెళుతున్న మహిళలు

మహిళల కోసం శక్తి



- యాప్‌తో రక్షణ ● మఫ్టీలో పోలీసుల గస్తీ
- జిల్లాలో ఐదు బృందాల ఏర్పాటు



శక్తి బృందాలకు దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్ (ఫైల్)

రాజాం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. ఉమెన్ ప్రొటెక్షన్ వింగ్ పేరుతో మహిళా దినోత్సవం రోజున సీఎం చంద్రబాబునాయుడు శక్తి యాప్‌ను ప్రారంభించారు. ఎస్పీ వకుల్ జిందాల్ గత నెల 13న జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్‌తో సమావేశమయ్యారు. జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణ కల్పించేందుకు నిలిచే చట్టాలపై అవగాహన కల్పించారు. శక్తి టీమ్స్ నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారికి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో శక్తి టీంల పనితీరును ఏఎస్పీ (అడ్మినిస్ట్రేషన్) సౌమ్యలత పర్యవేక్షిస్తారు. మహిళా పోలీసు స్టేషన్ సి.ఐ. నరసింహమూర్తి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. డీజీపీ కార్యాలయంలో శక్తి టీంల పనితీరును నిరంతరం పర్యవేక్షించేలా హోంశాఖ ఏర్పాట్లు చేసింది.

● జిల్లాలో ఇలా..

జిల్లా కేంద్రంతో పాటు రాజాం, బొబ్బిలి పట్టణాలలో ఆరుగురు పోలీసుల వంతున అయిదు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందానికి ఒక్కో ఎస్.ఐ. నాయకత్వం వహిస్తారు. ఎస్పీ పర్యవేక్షణలో ప్రస్తుతం ఈ అయిదు బృందాలు పని చేస్తున్నాయి. కళాశాలలు, ముఖ్య కూడళ్లలో మఫ్టీలో వీరు సంచరిస్తారు. మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి... వారిపై చట్టపరమైన చర్యలకు సిఫారసు చేస్తారు.

● క్షణాల్లో సమాచారం..

అత్యవసర సమయాలలో యాప్ తెరిచి.. అందులోని ఎస్ఓఎస్‌పై నొక్కితే ఫోన్‌లోని కెమెరా ఆటోమేటిక్‌గా తెరుచుకుని పది సెకెన్లలో వీడియో రికార్డ్ అవుతుంది. ఆ సమాచారం క్షణాల్లో పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రక్షణ కల్పిస్తారు. పిల్లలు తప్పిపోతే మిస్సింగ్ చైల్డ్ రిపోర్టింగ్ ఆప్షన్ ద్వారా ఫిర్యాదు చేసుకునే సౌకర్యాన్ని కూడా యాప్‌లో పొందుపరిచారు. శక్తి యాప్‌లో సేఫ్ జర్నీ, గివ్ ఎ కంప్లయింట్, మిస్సింగ్ చైల్డ్ రిపోర్ట్, నైట్ షెల్టర్స్ ఫ్యామిలీ కౌన్సిలింగ్, ఎమర్జెన్సీ కాంటాక్ట్ తదితర ఫిర్యాదు ఆప్షన్లు ఉన్నాయి.

● నమోదు ఇలా..

'శక్తి యాప్.. ఏపీ పోలీస్'ను సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీతో ఇందులో నమోదు కావాలి. ఆపై వచ్చే ఆప్షన్‌లో పేరు, చిరునామా, ఫోన్ నంబర్, లోకేషన్ తదితర వివరాలను నమోదు చేయాలి. కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించి అందుబాటులో ఉండే రెండు ఫోన్ నంబర్లను కూడా ఇందులో పొందుపరచాలి.

● ఆకతాయిల ఆట కట్టిస్తాం..

జిల్లాలో ఆకతాయిల ఆట కట్టిస్తాం. మహిళలపై జరుగుతున్న వేధింపులు, దాడులను నియంత్రిస్తాం. మహిళలు, బాలికలకు రక్షణ కల్పిస్తాం. ప్రధానంగా బాలికలు, మహిళలు, చిన్నారుల రక్షణ, భద్రత శక్తి ముఖ్య లక్ష్యం. సెల్‌ఫోన్‌లో యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో యాప్ ద్వారా రక్షణ పొందవచ్చు. శక్తి యాప్‌పై జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహిళలను చైతన్యవంతులను చేస్తున్నాం.

-వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

త్వరలోనే
ఆర్ఈసీఎస్ పునరుద్ధరణ

- ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

చీపురుపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఆర్ఈసీఎస్ సంస్థను త్వరలోనే పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు తెలిపారు. చీపురుపల్లి నుంచి బాగువలస, బిల్లలవలస మీదుగా గర్భాం రోడ్డును కలుపుతూ నూతనంగా రూ.8.76 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో నిర్మించిన తారు రోడ్డును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కొత్త రోడ్డు వల్ల మెరకముడిదాం, గరివిడి మండలాల్లోని సుమారు 15 గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. అనంతరం ఆర్ఈసీఎస్‌పై ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ పునరుద్ధరణ అంశాన్ని తాను మంత్రి నారా లోకేష్‌కు చెప్పానన్నారు. ఆయన వెంటనే చొరవ తీసుకొని, సంబంధిత మంత్రికి చెప్పారని... సీఎం పేషీకి సమాచారం వెళ్లిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సంస్థ పునరుద్ధరణకు సుముఖంగా ఉన్నారని కళా చెప్పారు. త్వరలోనే అవసరమైన ఉత్తర్వులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, టి.కిరణ్, కోట్ల మోతీలాల్ నాయుడు, తాడ్డి సన్యాసినాయుడు, విసినిగిరి శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

- కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మాంసం, గుడ్లు ఉత్పత్తి ద్వారా జిల్లాలో అభివృద్ధి సూచీలను పెంచడానికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉత్పాదకత పెంపొందించవలసిన అవసరం ఉందని తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశు సంవర్థక శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మహిళా సమాఖ్యల ద్వారా ప్రతి మండలంలో ఒక గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తికి సూచించారు. అందుకు కావలసిన సాంకేతికపరమైన సహకారాన్ని పశు సంవర్థక శాఖ అధికారులు అందించాలని ఆదేశించారు. దీని కోసం రానున్న 10 రోజుల్లో ప్రణాళికలు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గానికి ఒక మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌ను గుర్తించి... గొర్రెలు, మేకల యూనిట్ల ఏర్పాటుకు కూడా రాయితీ రుణాలు అందజేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం వేసినట్టు కలెక్టర్ చెప్పారు. మరో వెయ్యి ఎకరాల్లో విస్తరించా లన్నారు. సీపీవో బాలాజీ, పశు సంవర్థక శాఖ జేడీ రమణ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి తదితరులు ఉన్నారు.



ప్రాక్టీస్‌లో పాల్గొన్న ఎస్పీ వకుల్ జిందాల్

లక్ష్యంపై గురి తప్పకూడదు

- ఎస్పీ వకుల్ జిందాల్

నెల్లిమర్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఫైరింగ్ ప్రాక్టీస్‌లో గురి తప్పకూడదని... లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఒత్తిడిని జయించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లాలో పని చేస్తున్న పోలీసు అధికారులకు వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌ను నెల్లిమర్ల మండలం సారిపల్లి వద్ద గల జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ... ఫైరింగ్ ప్రాక్టీస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు అధికారులు క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల ఆయుధాలను సమర్థవంతంగా వినియోగించగలిగే నైపుణ్యం మెరుగుపడుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు అధికారులు సమయస్ఫూర్తితో వ్యవహరించి... రక్షణ చర్యలు చేపట్టడంలో ఫైరింగ్ ప్రాక్టీస్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆయుధాల వినియోగంలో పరిజ్ఞానాన్ని మెరుగు పరుచుకోవడం, శారీరక, మానసిక సమతౌల్యం సాధించడం, ఒత్తిడిలో కూడా సరిగ్గా లక్ష్యాన్ని ఛేదించడం అవసరమని అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీలు, ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యరెడ్డి, ఎం.వీరకుమార్, ఎస్.రాఘవులు, సీఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పురిటిపెంటలో తాగునీటి కష్టాలు

- జాతీయ రహదారి విస్తరణ మొదలు కష్టాలే
- అప్పట్లో పైప్‌లైన్లు, బోరుబావుల తొలగింపు
- డైరెక్ట్ పంపింగ్‌తో నీటి కోసం పడిగాపులు

గజపతినగరం ఏప్రిల్3:(ఆంధ్రజ్యోతి) మండలంలోని పురిటిపెంట షరాబుల కాలనీవాసులు తాగునీటికి కటకటలాడుతున్నారు. తాగునీటి కోసం మహిళలు పడిగాపులు కాస్తున్నారు. ఇటీవల జాతీయ విస్తరణలో భాగంగా తాగునీటి పైపులైన్లు, బోరుబావులను తొలగించారు. దీంతో జాతీయ రహదారి దాటి బాలాజీనగర్ నుంచి తాగునీటిని తీసుకువచ్చేవారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటా కుళాయిల పథకం ప్రారంభించినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. కొన్నిచోట్ల పైపులైన్లు మరమ్మతులకు గురైనా పాలకులు పట్టించుకోవడం లేదు. కాలనీవాసులకు డైరెక్ట్ పంపింగ్‌తో నీటిని సరఫరా చేస్తుండటంతో ఉదయం, సాయంత్రం తాగునీటి కోసం వేచి చూడాల్సిన పరిస్థితి వారికి నెలకొంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి షరాబుల కాలనీకి తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



తాగునీటి కోసం వేచి ఉన్న మహిళలు

నేడు విద్యుత్ సరఫరా కట్

గజపతినగరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా ఐదు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి ఎ.అనంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరం, పురిటిపెంట, వెంకటాపురం, బంగారమ్మపేట, బూదేవిపేట గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు.

●లక్కవరపుకోట: విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా శుక్రవారం కల్లేపల్లి, రేగ, పెదిరెడ్లపాలెం, లచ్చింపేట, సీతాగొర్లెవానిపాలెం, పూడివానిపాలెం, రొంగలిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

●శృంగవరపుకోట: పట్టణ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏఈ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్సీ కాలనీ, గౌరీశంకర కాలనీ, జీసీసీ రోడ్డు, మునసబ్ వీధి, మెండి వీధి, నూకాంబిక ఆలయం, కొటాన వీధి, ఒన్‌వే ట్రాఫిక్ రోడ్డు, అలంకార్ థియేటర్, సీతంపేట, ప్రకాశం మార్కెట్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

●నెల్లిమర్ల: కొండవెలగాడ విద్యుత్ సబ్‌స్టేషన్, 11 కేవీ తాళ్లపూడి రూరల్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొండవెలగాడ, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎన్ పురం, తుమ్మలపేట, పెదబూరాడపేట, తాళ్లపూడిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విజయనగరం టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారదర్శకంగా భూ రీసర్వే



ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూ యజమానుల సమక్షంలోనే రీ సర్వేను పారదర్శకంగా చేపడతామని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. గురువారం పార్వతీపురం మండలం తాళ్లబురిడిలో భూ రీసర్వే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రైతులకు ముందుగా నోటీసులు అందించి వారి సమక్షంలో రోవర్ సాయంతో కచ్చితమైన హద్దులను నిర్ణయిస్తామన్నారు. గతంలో జరిగిన భూ సర్వేలోని లోపాలు, తప్పులను సవరించేందుకు ఇది చక్కని అవకాశమని అన్నారు. రీసర్వే గ్రామసభలకు రైతులు హాజరై భూ రికార్డులను స్పష్టంగా సరిచూసుకోవాలన్నారు. అవసరమైన సవరణలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ర్యాలీలో తహసీల్దార్, ఉప తహసీల్దార్, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా వేమాలమ్మతల్లి తీర్థం



ఎడ్ల బండ్ల పరుగు పోటీ దృశ్యం

వేపాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాది శివారు మైసర్ల సింగవరంలో గురువారం గ్రామదేవత వేమాలమ్మతల్లి అమ్మవారి తీర్థమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. గ్రామపెద్ద మైచర్ల అప్పటన్న, తానాన శ్రీను, ఆకులసీతంపేట మాజీ సర్పంచ్ మంచిన అప్పసూరిల సహకారంతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

భూరికార్డుల ట్యాంపరింగ్‌పై కలెక్టర్ ఆగ్రహం

- సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలకు ఆదేశం



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

భోగాపురం, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): భోగాపురం మండల రెవెన్యూ కార్యాలయంలో భూ రికార్డుల ట్యాంపరింగ్‌పై కలెక్టర్ అంబేడ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం మండలంలోని తూడెంలో ఆయన పర్యటించారు. తూడెంలో భూ వివాదం జరుగుతుండంతో సంబంధిత భూములను పరిశీలించారు. చుట్టుపక్కల రైతులతో మాట్లాడారు. అయితే సమస్య గ్రామానికి సంబంధించినది కావడంతో అందరూ కలిసి చర్చించుకోవాలని సూచించారు. పరిష్కారం కాకుంటే మరోసారి రీసర్వే చేసి భూములు అప్పగిస్తామన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో భూరికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ఫోన్‌లో మాట్లాడారు. మరి కొందరితో నేరుగా మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే భూరికార్డులు పరిశీలిస్తుండగా ఎఫ్‌సీవో రికార్డుల్లో కవులవాడ గ్రామానికి సంబంధించి సర్వే నెంబరు 128కి చెందిన వివరాలతో కూడిన రెండు పేజీలు ట్యాంపరింగ్ జరిగినట్టు కలెక్టర్ అంబేడ్కర్ గుర్తించారు. రికార్డులో ఉండే రెండు అసలైన పేజీలను తొలగించి అదే స్థానంలో కొత్తగా రెండు పేజీలను అతికించి రికార్డుల్లోని వివరాలను మార్పు చేసి డి-పట్టాలను జారీ చేసినట్లు గుర్తించారు. అయితే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే రైతులకు సత్వర న్యాయం అందించాలని ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో దాట్ల కీర్తి, తహసీల్దారు ఎం.సురేష్ పాల్గొన్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నాయకులు

చీపురుపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు అన్యాయం చేస్తున్న వెంకటరామ కోళ్ల పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టీవీ రమణ, సీఐటీయూ నాయకులు అంబల్ల గౌరునాయుడు ఎమ్మెల్యే కళా వెంకటరావుకు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులను అన్యాయంగా యాజమాన్యం తొలగించిందన్నారు. నిబంధనల ప్రకారం పరిశ్రమలో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకు కేటాయించాల్సి ఉందన్నారు. అయితే యాజమాన్యం స్థానికులను తొలగించి, పొరుగు రాష్ట్రాలకు చెందిన వారితో పనులు చేయిస్తోందని ఎమ్మెల్యేకు వివరించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారానికే ప్రభుత్వం ప్రజాదర్బార్ నిర్వహిస్తోందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ప్రభుత్వం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరించడం జరిగిందన్నారు. కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

జాతీయ స్థాయిలో యువతుల రాణింపు



బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్న యువతులు

గరివిడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆర్.మౌనిక, పి.రేణుక, జి.శ్రావణి యువతులు జాతీయ టెన్నీస్ చాం పియన్‌షిప్ పోటీల్లో రాణించారు. రాష్ట్రం తరఫున ముగ్గురు యువతులు పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించారు. 48వ ప్రీమియర్ నేషనల్ టెన్నీకాయిట్ ఛాంపియన్‌షిప్ పోటీలు మార్చి 26 నుంచి 31 వరకు ఒడిశా రాష్ట్రంలో జరిగాయి. ఈ పోటీలలో పాల్గొన్న ఈ ముగ్గురు ఛాంపియన్‌షిప్‌లో బ్రాంజ్ మెడల్ సాధించడం పట్ల జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ సభ్యులు, గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొండవెలగాడ విద్యార్థులు



కుస్తీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నెల్లిమర్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు 8 మంది విద్యార్థులు ఎంపికైనట్టు పీడీ పతివాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 4 నుంచి 6 వరకు రాజమండ్రిలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీతో పాటు హెచ్‌ఎం వి.జ్ఞానశంకర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

వైద్యరంగానికి ప్రాధాన్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

వంగర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం అరసాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించటంతో పాటు పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశాలలు నిర్మిస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో మందులు సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరలో మండలంలో 8 రహదారి పనులకు శంకుస్థాపనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొత్స వాసుదేవరావు, పైల వెంకటరమణ, పిన్నింటి మోహన్, ఎల్.కృష్ణమూర్తి, ధనలక్ష్మి, రాజగోపాలనాయుడు, తుమ్మి తవిటినాయుడు, శ్రీను, రవి, రాంబాబు తదితరులున్నారు.

నాగరాజు కుటుంబానికి పరామర్శ

రాజాం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త టంకాల నాగరాజు తండ్రి టంకాల తిరుపతిరావు గురువారం వడదెబ్బతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం పరామర్శించారు. తిరుపతిరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు కిమిడి అశోక్‌కుమార్, నంది సూర్యప్రకాశరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రాజాం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలలను అధిరోహించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఐటీఐ విద్యార్థులు రాష్ట్రంలోనే ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగదొడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కరరావు. జీఎంఆర్ పీఏ రెడ్డి అన్నంనాయుడు, జగన్మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, పార్టీ నాయుకులు గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, దూబ ధర్మారావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తేలని సరిహద్దుల సమస్య

- ఎమ్మెల్యేకి రంగరాయపురం గ్రామపెద్దల ఫిర్యాదు



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న ఈశ్వరరావు

లక్కవరపుకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సరిహద్దులు తేల్చాలని, సీఎంవో కార్యాలయం ఆదేశాలను జిల్లా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని ప్రజాదర్బార్‌లో రంగరాయపురం గ్రామ పెద్దలు ఎమ్మెల్యే లలితకుమారికి ఫిర్యాదు చేశారు. దశాబ్దల కాలంగా సంతపేట, రంగారాయపురం పంచాయతీల సరిహద్దుల వివాదం కొనసాగుతోంది. దీనిపై గత ఏడాది నవంబరు 2న ఎమ్మెల్యే లలితకుమారి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన సీఎం.. సమస్యను పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారులకు మార్చి 19న ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఏప్రిల్ 3న సంతపేట, రంగారాయపురం, పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు, రెవెన్యూ శాఖ అధికారులు సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి సరిహద్దుల సమస్య పరిష్కరించాలని సీఎంవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. తీరా చూస్తే సమావేశం నిర్వహించకుండా డివిజనల్ పంచాయతీ అధికారి వాయిదా వేశారు. దీనిపై రంగారాయపురం గ్రామస్థులు భగ్గుమన్నారు. సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పకుండా వాయిదా వేయడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజాదర్బారులో ఫిర్యాదు చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. ● ఈ విషయమై డివిజనల్ పంచాయతీ అధికారి ఎ.మోహనరావు మాట్లాడుతూ సీఎంవో ఆదేశాల మేరకు రంగారాయపురం పంచాయతీ సరిహద్దు సమస్యపై విచారణ చేయాల్సి ఉందని, అనారోగ్య సమస్యతో రాలేక వాయిదా వేశానన్నారు. ఎప్పుడు నిర్వహిస్తామో నోటీసు ద్వారా పంచాయతీకి తెలియమన్నారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక

- సత్తా చాటిన రాజాం యువతి



సాయిశివాని

రాజాం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఒక ఉద్యోగానికి వందల్లో పోటీపడుతున్న రోజుల్లో ఒకే యువతి మూడు ఉద్యోగాలు సాధించి సత్తా చాటింది. ఇటీవల విడుదలైన ఐబీపీఎస్ ఫలితాలలో బ్యాంక్ ఆఫ్ బరోడాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ (కడప) ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఇదే బ్యాంక్‌లో క్లర్క్‌గా ఎంపికై తానేంటో నిరూపించుకుంది పట్టణంలోని ఈశ్వర నారాయణ కాలనీకి చెందిన సిద్ధాంతం సాయిశివాని. విజయనగరంలోని జేఎన్‌టీయూలో బీటెక్ కంప్లీట్ చేసిన శివాని బ్యాంకు ఉద్యోగంపై మక్కువతో శిక్షణ పొంది ఐబీపీఎస్ పరీక్షలకు హాజరైంది. ఈమె తండ్రి భానుమూర్తి రేగిడి మండలం ఏవీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు. తల్లి ప్రభావతి చీపురుపల్లిలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. శివాని ఒకేసారి మూడు బ్యాంకు కొలువులు సాధించడంపై కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందించారు.

జైలులో పరిచయం.. నాలుగు జిల్లాల్లో చోరీలు

- ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు
- 17 కేసుల్లో చోరీ చేసినట్టు గుర్తింపు
- రూ.45 లక్షల ఆభరణాలు, వాహనం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాతోపాటు విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మొత్తం 17 కేసుల్లో నిందితులైన ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. 'పలాస, కాశీబుగ్గ పరిధిలో నర్సిపురం రైల్వేగేటు ఫ్లైఓవర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిద్దరినీ పోలీసులు విచారించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జోగంపేటకు చెందిన పోల భాస్కరరావు, ఎచ్చెర్ల మండలం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ నర్సింగరావులుగా వారిని గుర్తించారు. గతంలో వీరిద్దరిపై జిల్లాలో 16 దొంగతనాలు, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో ఒక చోరీ కేసుతోపాటు, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో కూడా దొంగతనం కేసులున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరిద్దరూ గతేడాది పలాసలో దొంగిలించిన బంగారు ఆభరణాలను విక్రయించేందుకు వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి సుమారు రూ.36.80 లక్షల విలు వైన 435.52 గ్రాములు(37తులాలు) బంగారు ఆభరణాలు, ఒక డైమండ్ బ్రాస్‌లెట్, డైమండ్ లాకెట్, సుమారు రూ.26వేల విలువైన 233.2 గ్రాములు(20తులాలు) వెండి వస్తువులు, రూ.25వేల నగదు, ఒక మోటారు సైకిల్, ఒక కారును స్వాధీనం చేసుకున్నామ'ని ఎస్పీ తెలిపారు.

● 'ఈ కేసులో నిందితుడైన ముద్దాడ నర్సింగరావు గతంలో రెండు ద్విచక్ర వాహనాలను కూడా దొంగతనం చేశాడు. 2018లో జైలుకు వెళ్లిన వీరిద్దరికీ అక్కడే పరిచయం ఏర్పడి, వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగిలించిన ఆభరణాలను విశాఖపట్నానికి చెందిన బోని గోవిందరాజులకు, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గ్రంథి శ్రీనివాసరావుకు, ఎచ్చెర్లకు చెందిన పోలం కృష్ణ, ఒడిశాకు చెందిన ముత్యాలుకు ఇచ్చినట్లు విచారణలో తేలింది. దొంగిలించిన కొంత సొమ్ముతో కారు కొన్నారు. వాస్తవానికి 17 కేసుల్లో 76 తులాల బంగారం చోరీ చేసినప్పటికీ.. 37 తులాలు రికవరీ చేశాం. త్వరలో మిగిలిన బంగారాన్ని కూడా రికవరీ చేస్తామ'ని ఎస్పీ స్పష్టం చేశారు. దొంగతనాల్లో వారిద్దరికీ సహకరించిన మరొకరి కోసం గాలిస్తున్నామని తెలిపారు. కేసులో ప్రతిభ చాటిన ఏఎస్పీ క్రైం పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ డీఎస్పీ వీవీ వెంకటప్పారావు, సీసీఎస్ సీఐ సూర్యచంద్రమౌళి, కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, సీసీఎస్ ఎస్ఐ కె.మధుసూదనరావు, గఫూర్, హెచ్‌సీ శ్యామసుందరరావు, పీసీలు భాస్కరరావు, విజయకుమార్, హరీష్, ఉషాకిరణ్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.వి.రమణ, ఎస్పీ సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన వ్యక్తికి యావజ్జీవ శిక్ష

కొత్తవలస, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో జోడు నాగరాజుకు విజయనగరం జిల్లా అండ్ సెషన్స్ న్యాయాధికారి బి.కల్యాణచక్రవర్తి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.వెయి జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోఇని అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడుమెరక గ్రామానికి చెందిన జోడు నాగరాజు, లక్ష్మి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లు వారి కాపురం సక్రమంగానే సాగింది. కొడుకు పుట్టిన తర్వాత నాగరాజు వేరే యువతితో చనువుగా ఉండటంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దాంతో లక్ష్మి భర్తకు దూరంగా ఉంటోంది. దాంతో తనకు విడాకులు ఇవ్వాలని భార్యపై వత్తిడి తెచ్చేవాడు. దానికి అంగీకరించకపోవడంతో లక్ష్మి అడ్డు తొలగించుకుని తాను దగ్గరైన యువతిని పెళ్లి చేసుకోవాలని నాగరాజు భావించాడు. భర్తకు దూరంగా ఉంటున్న లక్ష్మి.. కొత్తవలసలోని స్వీట్‌షాపులో పని చేస్తోంది. ఈక్రమంలో 2022 జనవరి 28న సాయంత్రం స్వీట్‌షాపు నుంచి ఇంటికి వెళ్తున్న లక్ష్మి దగ్గరకు భర్త నాగరాజు వెళ్లాడు. మంచి మాటలు చెప్పి అర్థానపాలెం-గొల్లపేటలో ఆంజనేయ తీర్థం వెళదామని చెప్పి తన స్కూటీపై ఎక్కించుకుని వెళ్లాడు. భర్త మాటలు నమ్మి స్కూటీపై వెళ్లిన లక్ష్మిని అర్థానపాలెం దాటిన తరువాత నిర్మానుష్యంగా ఉన్న పెద్దగొప్పు ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెతో మాట్లాడుతున్నట్టు నటించి బండరాయితో తలపై మోది పక్కనే ఉన్న గోతిలో తోసేశాడు. అయితే బండరాయితే మోదినప్పటికీ ఆమె బతికే ఉందేమోనన్న అనుమానంతో మరుసటి రోజు వెళ్లి ఆమె ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తర్వాత తన భార్య కనిపించడం లేదంటూ కొత్తవలస పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి సీఐ బాల సూర్యారావు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. చివరకు నాగరాజును అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేయడంతో అసలు విషయం బయటపడింది. నాగరాజుపై రెల్లి వీఆరో జి.వెంకటరవీంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. మూడేళ్ల విచారణ అనంతరం నాగరాజు నేరం రుజువుకావడంతో న్యాయాధికారి తీర్పు ఖరారు చేశారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పాలకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సింగన్నవలస గ్రామంలో అప్పుల బాధ తాళలేక మునుకోటి చిన్నారావు (60) అనే వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మూడు నెలల కిందట చిన్నారావు భార్య పుష్ప మృతి చెందింది. అలాగే ఆయనకు సుమారు రూ.4లక్షల అప్పు ఉంది. కొడుకు, కోడలు ఇక ఇంటిలో ఉండగా, చిన్నారావు వేరే ఇంటిలో ఉంటున్నాడు. అప్పులతో తనకు సంబంధం లేదని కొడుకు చెప్పడంతో చిన్నారావు మరింత మనస్తాపం చెందాడు. ఇంటి దగ్గర ఉన్న పశువుల శాలలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడు. ఎస్ఐ ప్రయోగమూర్తి ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ లైన్‌మన్ మృతి

నెల్లిమర్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురై విద్యుత్ లైన్‌మన్ మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం నెల్లిమర్ల నగర పంచాయతీలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని తెలుకల వీధిలో నివాసం ఉంటున్న ఎన్.వెంకటస్వరూప్(32) విజయనగరం డివిజన్ పూల్‌బాగ్ సెక్షన్‌లో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఎండ తీవ్రంగా ఉండటంతో నిద్రపోయారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో నిద్ర లేపడానికి ఆయన తల్లి ప్రయత్నించారు. ఎంతకీ లేవకపోవడంతో ఆందోళనతో కేకలు వేసి కుటుంబ సభ్యులను పిలిచింది. అప్పటికే అతడు మృతిచెందారు. నాలుగేళ్ల కిందట స్వరూప్ ఉద్యోగంలో చేరాడు. స్వరూప్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

కానిస్టేబుల్ పేరుతో మోసం

వీరఘట్టం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ పేరుతో ఫోన్ చేసి, ఒక వ్యక్తి నుంచి ఫోన్‌పే ద్వారా రూ.28వేలు కాజేసిన వైనం వీరఘట్టంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ కళానిధి గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరఘట్టంలోని తెలగవీధిలో నివసిస్తున్న గెల్ల వేణుగోపాలరావుకు గత నెల 31న అపరిచిత నెంబర్‌తో ఫోన్ వచ్చింది. తాను వి.సంతోష్‌కుమార్ అని, వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నానని, ఎస్ఐ అబ్బాయి ఆసుపత్రిలో ఉన్నాడని, అందుకు డబ్బులు అవసరమని, ఫోన్‌పే ద్వారా పంపించాలని తెలిపాడు. ఇలా పలుమార్లు ఫోన్ చేశాడు. దీంతో వేణుగోపాలరావు తన వద్ద ఉన్న రూ.28వేలను అదే రోజు ఫోన్‌పే ద్వారా పంపించాడు. తర్వాత ఫోన్ చేయగా ఫోన్ స్విచ్‌ఆఫ్ అయిపోయింది. దీంతో మోసపోయానని గ్రహించిన వేణుగోపాలరావు పోలీసులను ఆశ్రయించాడు. అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కళానిధి గురువారం కేసు నమోదు చేశారు.



ఈవోపీఆర్‌డీకి ఫిర్యాదు చేస్తున్న లోగిశ రామకృష్ణ

చట్ట ఉల్లంఘనలపై చర్యలేవీ?

జామి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోట్లపల్లి పశువుల సంత నిర్వహణలో చట్ట ఉల్లంఘనలు జరుగుతుంటే అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మండిపడ్డారు. గురువారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీను కలిశారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'కూసంత కరుణలేదా..?' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఏడాదిగా సంత నిర్వహణకు అనుమతులు లేకున్నా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అధికారులపై చర్యలతో పాటు సంత నిర్వాహకులను అరెస్టు చేయాలని కోరారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు.సమావేశంలో సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఆర్ సత్యనారాయణ, జిల్లా మహిళ అధ్యక్షురాలు చోల్ల రాజకుమారి, కమిటీ ప్రతినిధులు వేముల యమున, కేత జీవన ఎడిది బంగారయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ప్రైవేట్ గేటు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములాపల్లి గోస్తనీ తీరంలోకి ఎవ్వరు వెళ్లకుండా ఒక వ్యక్తి ఏర్పాటు చేసిప ప్రైవేట్ గేటును రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. 'గోస్తనీలోకి వెళ్లకుండా ప్రైవేట్ గేటు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం కథనం ప్రచురితమైన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు ఆదేశాల మేరకు ఆర్ఐ మనోజ్‌కుమార్ గేటు ఏర్పాటు చేసిన ప్రదేశానికి వెళ్లారు. గేటును తొలగించే ఏర్పాటు చేశారు. అనంతరం గేటు ఏర్పాటు చేశాడని భావిస్తున్న వ్యక్తిని రమ్మని ఆర్ఐ కబురు పెట్టడంతో ఆ గేటుకు తనకు ఎలాంటి సంబంధం లేదని బదులిచ్చాడన్నారు. ఏదేమైనా ప్రైవేట్ గేటును రెవెన్యూ ఆదికారులు తొలగించడం వల్ల తమ అవసరాలకు ఇసుకను సులువుగా తెచ్చుకోవచ్చని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చినోళ్లకు నచ్చినచోట!

(ఐదో పేజీ తరువాయి)

కానిస్టేబుళ్లు 95, హెడ్ కానిస్టేబుళ్లు 56, ఎస్‌ఐలు 29, సీఐలు 22, జూనియర్ అసిస్టెంట్‌లు 12, ఇతర ఉద్యోగులు ఏడుగురికి బదిలీ జరిగింది. కొందరిని పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ చేస్తూ మిగతా వారిని విజయనగరం జిల్లాలోనే ఉంచారు. అయితే బదిలీ ప్రక్రియపై చాలా విమర్శలు వచ్చాయి. అన్యాయంగా బదిలీ అయినవారు తీవ్ర ఆవేదనతో ఉన్నారు. అధికారుల ఆదేశాలను ప్రశ్నించే సాహసం చేయలేక మిన్నకుండిపోయారు. అడిగినంత ఇచ్చుకోలేకే బదిలీ అయ్యామని వాపోతున్నారు.

విజయనగరం జిల్లాతో పోల్చిచూస్తే పార్వతీపురం మన్యం జిల్లాలో ఎక్సైజ్ శాఖాపరమైన క్రైమ్ రేటు చాలా ఎక్కువ. గిరిజన జిల్లా కావడంతో జిల్లాలో నాటుసారా తయారీ విక్రయాలు అధికం. ముఖ్యంగా సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ తదితర ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో నాటుసారా కుటీర పరిశ్రమను తలపిస్తుంది. దీన్ని కట్టడిచేసేందుకు దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం పాక్షికమే. అక్కడ ఎక్సైజ్ సిబ్బందికి విధుల నిర్వహణ కత్తి మీద సామే. పొరుగు రాష్ట్రం ఒడిశా నుంచి ప్రతిరోజూ ఇక్కడకు దిగుమతి అవుతున్న వేలాది లీటర్ల నాటుసారా ఎక్సైజ్ సిబ్బందికి పులిమీద పుట్రలా దాపురించింది. ఈ నేపథ్యంలో పార్వతీపురం జిల్లాలోని ఎక్సైజ్ సర్కిళ్లలో యువత, దేహదారుఢ్యం ఉన్న వారిని మాత్రమే నియమించాల్సి ఉంటుంది. దీనివల్ల కొంతైనా ఫలితం కనిపిస్తుంది. ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నవారు, దీర్ఘకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని అక్కడ నియమిస్తే సారా కట్టడి అసాధ్యమై ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది.

● పార్వతీపురం మన్యం జిల్లాకు తాజా బదిలీల్లో కేవలం 14 మందినే కేటాయించారు. అదికూడా వయసు పైబడినవారిని, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని అధికంగా బదిలీ చేసినట్టు పేరు చెప్పడానికి ఇష్టపడని ఉద్యోగులు తెలిపారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో దేహదారుఢ్యం కలిగిన యువ ఉద్యోగులకు కొదువలేదు. 2014 బ్యాచ్ ఉద్యోగులు 78 మంది ఉండగా వారిలో కేవలం 14 మందిని మాత్రమే పార్వతీపురానికి కేటాయించి మిగిలిన వారిని విజయనగరం జిల్లా పరిధిలోనే బదిలీ చేసినట్టు బోగట్టా. దీనివెనుక మతలబు ఏమిటన్నది ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. బదిలీల్లో చోటుచేసుకున్న సిత్రాల వెనుక పెద్దమొత్తం చేతులు మారినట్టు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు.

వైరల్ అవుతున్న ఉద్యోగి లేఖ..

విజయనగరంలో పనిచేస్తున్న ఓ సీనియర్ ఉద్యోగి బదిలీల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయని పేర్కొంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఏసీబీ డీజీ, ఎక్సైజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వక ఫిర్యాదును పోస్టు ద్వారా పంపారు. విచారణ జరిపిస్తే మరిన్ని విషయాలు బయటకు వస్తాయని కూడా అందులో పేర్కొన్నారు. ఈ లేఖ ఇప్పుడు ఎక్సైజ్ సిబ్బంది గ్రూపుల్లో చక్కర్లు కొడుతుండగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

వెంటాడి.. పట్టుకుని

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. గంజాయి పట్టుకోవడంలో సాలూరు పోలీస్ టీం చూపిన ప్రత్యేక చొరవను ఆమె అభినందించారు. ఈ ఏడాది ఆరంభమై 93 రోజుల్లో 1,500 కిలోల గంజాయిని సాలూరు పోలీసులు పట్టుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు, యువత గంజాయి జోలికి వెళ్లవద్దన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నా రు. వీటి సమాచారాన్ని 1972కు అందించి పోలీసులకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నిరోధక ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ, పట్టణ సీఐ బి.అప్పలనాయుడు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బెలగాం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ కలిగిన అభ్యర్థులకు ఆరు వారాలు శిక్షణ ఇస్తామని, అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. కనీసం ఇంటర్ చదివి పాఠశాల, కళాశాల, యూనివర్సిటీలో జరిగిన క్రీడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన అభ్యర్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న వారు శిక్షణకు అర్హులని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 14లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆర్చరీ, అథ్లెటిక్, బ్యాడ్మింటన్, బాస్కట్ బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడలకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

ఉపాధి సిబ్బందిపై ఒత్తిడి తగ్గించాలి

పార్వతీపురం/ గరుగుబిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తమపై ఒత్తిడి తగ్గించాలని కోరుతూ జిల్లా పరిధిలోని ఉపాధిహామీ సిబ్బంది కోరారు. ఈ మేరకు జిల్లా పరిధిలోని 15 మండలాలకు చెందిన ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను, డ్వామా పీడీని గురువారం కలిశారు. ఈసందర్భంగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. తమపై ఒత్తిడి తగ్గించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా గౌరవాధ్యక్షుడు జి.శ్రీహరిరావు, అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జి.తేజేశ్వర రావు, ఎం.గౌరీనాథ్, ఎంవీవీఎస్ శేషగిరి, జి.మధుసూదనరావు, దొడ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

పాలకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి సర్క్యులర్‌ను అమలు చేయాలని ఎన్‌ఎంయూ యూనియన్ అసోసియేషన్ డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ డిమాండ్ చేశారు. ఎన్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక డిపో ఎదుట ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అన్ని కేటగిరీల్లో ప్రమోషన్లు కల్పించాలని కోరారు. అన్ని రకాల సిక్‌లపై పూర్తిస్థాయి జీతం చెల్లించాలన్నా రు. గ్యారేజ్‌ల్లో స్పేర్‌పార్ట్స్ ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీఎల్ డెలిగేట్ ఎం.వైకుంఠరావు, ఎస్‌టీరావు, యు.లక్ష్మి, ఎస్.అంజిలి, ఎంఎస్ చలం, పి.మణి తదితరులు పాల్గొన్నారు.

కలప బహిరంగ విక్రయం

పార్వతీపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాలూరు ప్రభుత్వ వెదురు విక్రయ డిపోలో 2025-26 సంవత్సరానికిగాను టేకు, ఇతర కలప, వెదురు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని జిల్లా అటవీ శాఖాధికారి జేపీపీ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో వేలం ప్రతిపాదించిన తేదీల్లో కలప విక్రయిస్తామని చెప్పారు. కలప, వెదురు మొదటి వేలాన్ని ఏప్రిల్, మే, జూన్, జూలై, సెప్టెంబరు, అక్టోబరు, డిసెంబరు, వచ్చే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 9వ తేదీన, ఆగస్టు 11న, నవంబరు 10న, రెండో వేలం ఏప్రిల్, మే, జూన్, నవంబరు, డిసెంబరు, వచ్చే ఫిబ్రవరి నెలల్లో 21వ తేదీన, జనవరిలో 22వ తేదీన, మార్చిలో 20వ తేదీన కలప, వెదురును సాలూరు ప్రభుత్వ కలప సేల్ డిపోలో విక్రయిస్తారని ఆమె వివరించారు. వేలం పాటలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని ఆమె సూచించారు.

ఇప్పల పోలమ్మకు ప్రత్యేక పూజలు

పార్వతీపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఉన్న ఇప్పల పోలమ్మ దేవతకు భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయడంతో పాటు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్‌నారాయణ, బి.సీతారాం, కౌన్సిలర్ మంత్రి రవి, గణేష్, సత్యనారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి ధ్యానోత్సవంపై శిక్షణ

గరుగుబిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ధ్యానోత్సవంపై మూడు రోజుల పాటు శిక్షణ నిర్వహించనున్నారు. తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్, శ్రీరామచంద్ర మిషన్ (హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన సంస్థ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిక్షణ ఆయా తేదీలలో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఉంటుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి జె. మురళీరావు, సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డా.డి.పారినాయుడు తెలిపారు.

పక్కా రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కొమరాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గిరి శిఖర గ్రామాలకు డోలీ మోతలు ఉండకూడదన్న ఉద్దేశ్యంతోనే కూటమి ప్రభుత్వం పక్కా రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుణదతీలేసు పంచాయతీలో రూ.3.15 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును టీడీపీ మండల కన్వీనర్ శేఖర్‌పాత్రుడు ఆధ్వర్యంలో ఆమె గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సవర గుణద, గుణదతీలేసు వంటి గిరిజన గ్రామాలకు ఉపాధి నిధులతో బీటీ రోడ్లు నిర్మించడం ఆనందదాయకమని అన్నారు. అనంతరం ఉలిపిరి గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు నూతనంగా మంజూరైన ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గుణానుపురంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఏఎంసీ చైర్మన్ కె.కళావతి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కడ్రక మల్లేష్, టీడీపీ నాయకులు పి.వెంకటనాయుడు, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గుణానుపురంలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

అంబేడ్కర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా?

వీరఘట్టం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో భాగంగా వీరఘట్టంలో తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్లక్ష్యంగా విడిచిపెట్టారని, ఇదేనా ఆయనకు ఇచ్చే గౌరవం అని కేవీపీఎస్ నాయకులు ఆందోళన చేశారు. ఈ మేరకు గురువారం వీరఘట్టంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కేవీపీఎస్ నాయకుడు సింహాచలం మాట్లాడారు. స్థానిక పోలీస్‌స్టేషన్ దగ్గర మెయిన్‌రోడ్డు వద్ద ఉండే అంబేడ్కర్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారని అన్నారు. అయితే రోడ్డు పనులు పూర్తయి ఏడాది దాటిపోయినా విగ్రహాన్ని నిర్లక్ష్యంగా విడిచిపెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమంలో సంఘం నాయకులు మేరి, నాగేష్, మురళీ, బలరాం పాల్గొన్నారు.



విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నీటి తీరువా వసూళ్లపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామాల నుంచి నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ పి.బాల, ఉప తహసీల్దార్ బి.సుందరరావులు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వారు వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్వోలు అలసత్వం వహించకుండా రైతుల నుంచి నీటి తీరువా మొత్తాలను సేకరించాలన్నారు. నిర్దేశించిన సమయానికి వసూళ్లు చేయకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. రీసర్వేకు సంబంధించి రెండో విడతలో వల్లరిగుడబ, సుంకి పంచాయతీలను ఎంపిక చేశారని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ శ్రీనివాస గౌరీప్రసాద్, వీఆర్‌వో కె.రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

బెలగాం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం పెరుగుతుందని, వెంటనే వాటిని రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సుందరయ్య భవనంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఎం నాయకుడు బీవీ రమణ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు ప్రజలపై ఎటువంటి భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర ధరలు పెంచేలా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై మరింత భారం వేస్తోందని విమర్శించారు. ట్రై అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాకల సన్యాసిరావు, బి.సూరిబాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే ఆర్థిక అభివృద్ధి

భామిని, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నితి అయోగ్ ఎంపిక చేసిన మనుమకొండను అభివృద్ధి చేసేందుకు పురుషులు, మహిళలు వేర్వేరు సంఘాలుగా ఏర్పాటు కావాలని మైక్రోసేవ్ కన్సల్టెంట్ మేనేజర్ మిమాన్షఖన్నా సూచించారు. మనుమకొండ గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వ బృందం గురువారం సందర్శించింది. గ్రామస్థులతో సమావేశం నిర్వహించి, వీరి ఆర్థిక స్థితిగతులపై ఆరా తీశారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన, బీమా యోజన, ఆటల్ పెన్షన్ యోజనలలో నమోదు చేసుకుని వాటి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైక్రోసేవ సీనియర్ మేనేజర్ శుభి, మోహన్, మధుసుధన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం

కురుపాం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్, గైనకాలజిస్టు శోభరాణి తెలిపారు. కురుపాం ఆసుపత్రిలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన గర్భిణులకు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె గర్భిణులకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై, ఆపరేషన్ల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కురుపాం ఆసుపత్రిలో 90శాతం సాధారణ ప్రసవాలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ జి.ఈశ్వరమ్మ, స్టాఫ్ నర్సులు, గర్భిణులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గైనకాలజిస్టు

మరిన్ని విజయాలు సాధించాలి

● పారా అథ్లెట్ లలితకు కలెక్టర్ అభినందన

పార్వతీపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారా అథ్లెట్ కిల్లక లలిత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆకాంక్షించారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో ఆమెను దుశ్శాలువతో సత్కరించి, రన్నింగ్ షూస్‌ను బహూకరించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లా పేరును ఇనుమడింపచేయాలని కలెక్టర్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం గొల్లలంక గ్రామా నికి చెందిన లలిత తల్లిదండ్రులు బోర్జ, సీతమ్మలను కలెక్టర్ ముందుగా అభినందించారు. ఈసందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లలిత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటివరకు సాధించిన విజయాలపై కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎం.మురళీమోహన్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు డి.టి.గాంధీ, క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు, పీడీ, పీఈటీ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



లలితను అభినందిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ఇచ్చేవి 4.. దరఖాస్తులు 186

సీతంపేట రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ కింద రుణాలు మంజూరు చేస్తాం.. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోండి అని ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావహులంతా దరఖాస్తు చేసుకున్నారు. ఈక్రమంలో సీతంపేట మండలానికి సంబంధించి కూడా 186 మంది దరఖాస్తు చేసుకున్నారు. తీరా దరఖాస్తు చేసుకున్నాక, మండలానికి కేవలం 4 యూనిట్లు మంజూరయ్యాయని అధికారులు ప్రకటించారు. దీంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అధిక సంఖ్యలో లబ్ధిదారులు హాజరయ్యారు. ● దీనిపై ఈవోపీఆర్డీ సత్యం వద్ద వివరణ కోరగా.. బీసీ రుణాలకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయని, స్క్రూటినీ అనంతరం అర్హులైన లబ్ధిదారులకు యూనిట్లు కేటాయిస్తామని చెప్పారు.

ఏజెన్సీ వద్దు.. ఆప్కాస్ ముద్దు

● మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల జీతాలు చెల్లింపులకు సంబంధించి ఏజెన్సీలకు ఇవ్వకుండా, ఆప్కాస్‌నే కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసనకు సీఐటీయూ నాయకుడు జీవీ రమణ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని కోరారు. ఏజెన్సీల ఆలోచనను మానుకుని ఆప్కాస్‌ను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. వేసవి దృష్ట్యా పని వేళలను కుదించాలన్నారు. అనంతరం ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్ పకీరురాజుకు వినతిపత్రాన్ని అందజేశారు.

పెన్షన్ నిబంధనల సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

బెలగాం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈనెల 25న లోక్‌సభలో ప్రవేశపెట్టిన పెన్షన్ నిబంధనలు సవరణ ఉత్తర్వులు బిల్లును వెనక్కి తీసుకోవాలని పార్వతీపురం పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎంవీ చలం డిమాండ్ చేశారు. బిల్లును వ్యతిరేకిస్తూ స్థానిక పోస్టాఫీస్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఎంవీ చలం మాట్లాడుతూ ఈ బిల్లుతో రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పెన్షనర్స్‌కు ఉపయోగం లేని బిల్లు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు పాల్గొన్నారు.



నిరసన దీక్ష చేపట్టిన పెన్షనర్లు

మోదీ దొంగ బిల్లును ఖండిస్తున్నాం

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకొస్తున్న బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్‌రావు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 25న లోక్ సభలో ఆర్థిక బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు 'పెన్షన్ నిబంధనలు సవరణ ఉత్తర్వులు బిల్లు'అనే పేరుతో ఆర్థిక బిల్లుతో కలిసి దొంగతనంగా ప్రవేశపెట్టి ఆమోదింపచేశారని తెలిపారు. ఇప్పుడు ఆ బిల్లు రాజ్యసభలో ప్రవేశపెడతారని రాష్ట్రంలోని కూటమి పార్టీలు, వైసీపీ వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఈ బిల్లును ఆమోదిస్తే రిటైర్డ్ అయినప్పుడు ఉద్యోగికి ఎంత పెన్షన్ వస్తుందో జీవితాంతం అంతే పెన్షన్ వస్తుందని తెలిపారు. ఈ బిల్లును వెనక్కి తీసుకోకపోతే అన్ని ఉద్యోగ సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జియ్యమ్మవలస, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కుదమ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్‌కు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చేయనున్నామన్నారు. దీనివల్ల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నదని చెప్పారు.

● పాలకొండ: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ టౌన్ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. ఎన్‌కే రాజపురం సీఎల్ నాయుడు నగర్, నీలమ్మకాలనీ, ఏరియా ఆసుపత్రి, ఎంఎం.నగర్, యాతవీధి, వేమకోటివారివీధి, రామకళామందిర్‌వీధి ప్రాంతాల్లో నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. అలాగే లుంబూరు సబ్ స్టేషన్ పరిధిలో పనుల నిమిత్తం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు గాసివీధి, కస్పావీధి, రెల్లివీధి, దేవరపేట, కోమటిపేట, బోనంవీధి, వెంకమ్మపేట, పెదకాపువీధి, నెయ్యిలవీధి, లుంబూరువారి వీధుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

● మక్కువ: మక్కువ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ దుగ్గేరు ఫీడర్‌పైన విద్యుత్ వైర్ల వద్ద పిచ్చిమొక్కల తొలగింపు కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పార్వతీపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.గోపాలరావునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. త్రీపేజ్ సప్లయి మాత్రం ఉదయం 4 గంటలకు ఇస్తామన్నారు.

రేపు విజయవాడలో వీఆర్ఏల సదస్సు

కురుపాం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 5వ తేదీన నిర్వహించనున్న వీఆర్‌ఏల సదస్సు జయప్రదం చేయాలని జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఒక రూపాయి కూడా జీతం పెంచలేదన్నారు. జీతం పెంచకపోగా ప్రభుత్వ తిరిగి తమ వద్ద డీఏ రికవరీ చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్ధానం మరిచిందన్నారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, ప్రమోషన్లు ఇవ్వాలని ఆయన కోరారు. వన్ టైమ్ సెటిల్మెంట్‌గా నామిని వీఆర్‌ఏలను వీఆర్‌ఏలుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో గల వీఆర్‌ఏలు పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి

గజపతినగరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి అన్నారు. గురువారం కాళంరాజపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, షుగర్, రక్తపోటు రోగులకు పరీక్షలు నిర్వహించారు.

గృహ నిర్మాణ సంస్థ డైరీ ఆవిష్కరణ

పార్వతీపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ రూపొందించిన 2025 సంవత్సరం డైరీని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపడుతున్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత ఇంజనీర్లపై ఉందన్నారు. చిత్తశుద్ధితో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకుడు పి.ధర్మచంద్రారెడ్డి, హౌసింగ్ డీఈఈలు, ఏఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

గరుగుబిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గిజబ గ్రామంలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటుచేశారు.



న్యూస్ బాక్స్

స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటు

బొబ్బిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని దాడితల్లి కాలనీలో కాలనీ వాసులు స్వచ్ఛందంగా ఎనిమిది సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. వీటిని స్థానిక సీఐ కటకం సతీష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించుకోవచ్చని అన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బొబ్బిలి (తెర్లాం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెర్లాం మండలం ఎన్.బూర్జివలస గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోనంగి నాగభూషణరావు(67) గురువారం అకాల మరణం చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బేబీనాయన ఆ గ్రామానికి వెళ్లి నాగభూషణరావు కుమారుడు శ్యామ్‌ను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల నాయకులు నర్సుపల్లి వెంకటనాయుడు, వెంకటేష్, యుగంధర్ ఉన్నారు.

బోరు బాగు చేశారు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీహెచ్ బొడ్డవలస పంచాయతీ వడ్డవలస గ్రామంలో బోరు దుస్థితిపై 'మరమ్మతులు లేక.. తాగు నీరం దక' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. గురువారం ఆ గ్రామానికి వెళ్లి, బోరును బాగు చేయించారు.

గ్రావెల్‌తో ట్రాక్టర్లు సీజ్

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చింతాడ గ్రామ శివారు చెరువు నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను పట్టుకుని, సీజ్ చేసినట్టు ఆర్‌ఐ రామ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడకు చేరుకుని 3 ట్రాక్టర్లను, ఒక ప్రొక్లయినర్‌ను పట్టుకుని, సీజ్ చేశామన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

బాడంగి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బోర్లు, నీటి పథకాలకు మరమ్మతులు చేపట్టాలని ఆయన సూచించారు.

బీజేపీలో చేరిక

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారి మద్ది దొరబాబు గురువారం వైసీపీని వీడి బీజేపీలో చేరారు. ఆయన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం మాజీ మండల అధ్యక్షుడు దివాకర్, జిల్లా కార్యదర్శి బోటు అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

వీరఘట్టం ఆర్ఐగా మారుతీరావు

వీరఘట్టం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌ఐ లక్ష్మణ్‌నాయుడు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌ఐ మారుతీరావు డెప్యుటేషన్‌పై వచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఆర్‌ఐగా బాధ్యతలు స్వీకరించారని తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణకు నేటితో గడువు పూర్తి

బెలగాం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఒక అంగన్‌వాడీ, ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి ఈనెల 4తో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగిస్తుందని సీడీపీవో శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం ఇచ్చిన దరఖాస్తుదారులకు మాత్రమే ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

